క్లుప్తంగా

పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాట్ల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న రామలింగేశ్వర్

రాజమహేంద్రవరం సిటీ: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని పరేడ్ గ్రౌండ్‌లో జరుగుతున్న ఏర్పాట్లను బుధవారం అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ పరిశీలించారు. ఈ సందర్భంగా శానిటేషన్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. వేడుకలలో ఎటువంటి లోటుపాట్లు తలెత్తకుండా పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. ముఖ్యంగా సభా ప్రాంగణం, గ్యాలరీలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. పరేడ్ గ్రౌండ్ వెలుపల డ్రెయిన్ల మరమ్మతుల కారణంగా ఏర్పడిన డెబ్రిస్‌ను తక్షణమే తొలగించాలని ఆదేశించారు. ఆయన వెంట నగర ఆరోగ్యశాఖాధికారి వినూత్న తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ నగర అధ్యక్షుడిగా మురళీధర్



మాట్లాడుతున్న బాలేపల్లి మురళీధర్

రాజమహేంద్రవరం సిటీ: కాంగ్రెస్ నగర అధ్యక్షుడిగా ఆ పార్టీ సీనియర్ నాయకుడు, పీసీసీ సభ్యుడు బాలేపల్లి మురళీధర్ తిరిగి నియమితులయ్యారు. ఈ మేరకు పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల జారీ చేసిన నియమాక పత్రాన్ని పీసీసీ సభ్యుడు బోడ వెంకట్ చేతుల మీదుగా ఆయన అందుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన మీడియా సమావేశంలో బోడ వెంకట్ మాట్లాడుతూ త్వరలో కార్పొరేషన్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సిటీ కాంగ్రెస్ పార్టీకి కార్యాలయాన్ని ప్రారంభిస్తామని వివరించారు. మురళీధర్ మాట్లాడుతూ తనను పదవిలో నియమించిన అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

శ్రీనివాసరావు కార్టూన్‌కు బహుమతి



సత్కారం అందుకుంటున్న శ్రీనివాసరావు

కడియం: మండలంలోని వేమగిరి గ్రామానికి చెందిన కార్టూనిస్ట్ గుత్తుల శ్రీనివాసరావు కార్టూన్‌కు ఉత్తమ బహుమతి లభించింది. ఆ వివరాలను శ్రీనివాసరావు బుధవారం స్థానిక విలేకరులకు తెలిపారు. విశాఖ సంస్కృతి మాస పత్రిక 13వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ స్థాయిలో నిర్వహించిన కార్టూన్ పోటీల్లో తాన కార్టూన్‌కు ఉత్తమ స్థానానికి ఎంపికైందన్నారు. ఈ మేరకు వైజాగ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నగదు బహుమతి, జ్ఞాపికతో సత్కరించారన్నారు. పెంపుడు జంతువులపై చూపించే ప్రేమ ను తల్లిదండ్రులపై చూపించకపోవడాన్ని తన కార్టూన్ ద్వారా చూపించానన్నారు. ఇది పోటీలకు విచ్చేసిన పలువురి ప్రశంసలు అందుకుందన్నారు.

స్వాతంత్య్ర వేడుకలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

రాజమహేంద్రవరం సిటీ: రానున్న నాలుగైదు రోజుల పాటు అధిక వర్షాలు కురిసే అవకాశమున్న నేపథ్యంలో ఆర్ట్స్ కళాశాల మైదానంలో జరగాల్సిన స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను ప్రత్యామ్నాయ వేదికపై నిర్వహించేందుకు పరిశీలన జరుగుతోందని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. చిన్న రాముడు తెలిపారు. దీనికోసం సుబ్రహ్మణ్యం మైదానం, వెంకటేశ్వర ఆనం కళాకేంద్రాలను పరిశీలిస్తున్నట్టు తెలిపారు.

సినిమాలు




శ్యామల	:	బకాసుర రెస్టారెంట్
సూర్యమినీ	:	మహావతార్ నరసింహ,
సూర్యప్యాలెస్	:	అతడు
స్వామి	:	హరిహర వీరమల్లు
అనుశ్రీ	:	సు ఫ్రమ్ సో
శివజ్యోతి	:	సార్ మేడమ్
రాజా	:	కింగ్‌డమ్
ఊర్వశి	:	మహావతార్ నరసింహ
మేనక	:	రాజుగాని సవాల్
రంభ	:	జూనియర్
అప్సర	:	కింగ్‌డమ్
అశోక	:	కింగ్‌డమ్
నామవరం వీఎస్ మహల్	:	మహావతార్ నరసింహ
ధవళేశ్వరం మురళీకృష్ణ	:	మహావతార్ నరసింహ
కడియం వెంకటసూర్య	:	మహావతార్ నరసింహ

కృష్ణం వందే జగద్గురుం

- ఈ నెల 16న కృష్ణాష్టమి
- ముస్తాబైన ఆలయాలు
- ఇస్కాన్ ఆలయంలో ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు



విద్యుద్దీపాల అలంకరణలో మెరిసిపోతున్న ఇస్కాన్ టెంపుల్



రాధాకృష్ణుల విగ్రహాలు

సీటీఆర్ఐ: పిల్లలు, పెద్దలు అనే తేడా లేకుండా అందరూ ఎంతో ఉత్సాహంగా ఎదురుచూసే కృష్ణాష్టమి వేడుకలకు గోదావరి తీరం ముస్తాబైంది. ఈ సందర్భంగా జిల్లాలోని ప్రముఖ వైష్ణవాలయాలను ముస్తాబు చేశారు. గోదావరి గట్టున గల అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్), ఆర్యాపురంలోని శ్రీకృష్ణ చైతన్య సంఘం, కొవ్వూరులోని ఇస్కాన్ దేవాలయాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు.

ఉట్టి పండగ

కృష్ణాష్టమి రోజు భక్తులు పగలంతా ఉపవాసం ఉండి, సాయంత్రం శ్రీకృష్ణుడిని పూజిస్తారు. శ్రావణ మాసంలో లభించే పండ్లు, అటుకులు, బెల్లం కలిపిన వెన్న, పెరుగు మీగడను స్వామికి నైవేద్యంగా పెడతారు. ఊయల కట్టి అందులో శ్రీకృష్ణుని విగ్రహాన్ని ఉంచి, దాన్ని ఊపుతూ రకరకాల పాటలు, కీర్తనలు పాడతారు. పుర వీధుల్లో ఎత్తుగా ఉట్లు కట్టి పోటీపడి వాటిని కొడతారు. అందుకే ఈ పండగని ఉట్ల పండగ, ఉట్ల తిరునాళ్ల అని కూడా పిలుస్తారు. కృష్ణాష్టమి రోజు చిన్నారులకు కృష్ణుడి వేషం వేసి, వెన్న తినిపించి తల్లిదండ్రులు మురిసిపోతారు. రాజమహేంద్రవరంలోని గోదావరి గట్టుపై ఉన్న క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామి ఆలయం, జాంపేటలోని పాండురంగ ఆలయం, దేవీచౌక్‌లోని దశావతార కృష్ణుని గుడి, లాలాచెరువులోని గోవింద క్షేత్రంతో పాటు జిల్లాలోని అన్ని కృష్ణుని ఆలయాల్లో వేడుకలు నిర్వహిస్తున్నారు.

ఇస్కాన్‌లో..

నగరంలోని ఇస్కాన్ ఆలయంలో 16వ తేదీ ఉదయం 9 గంటలకు యజ్ఞ సేవ, మధ్యాహ్నం 3 గంటలకు ఉట్టి ఉత్సవం జరుగుతుంది. సాయంత్రం ఆరు గంటలకు తెప్పోత్సవం, రాత్రి 10 గంటలకు రాధాకృష్ణులకు మహాకుంభాభిషేకం నిర్వహిస్తారు.

వైభవంగా వేడుకలు



ఆర్యాపురంలోని శ్రీకృష్ణ చైతన్య ఆశ్రమంలో ఈ నెల 16వ తేదీన శ్రీకృష్ణ జన్మాష్టమిని వైభవంగా నిర్వహిస్తాం. మంగళ హారతితో కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. నగర సంకీర్తన, గోపూజ, హరినామ సంకీర్తనలు, ఉట్టి ఉత్సవంతో పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరుపుతాం. శ్రీకృష్ణ ఆవిర్భావ విశిష్టతపై శ్రీత్రిదండి స్వామి భక్తి కంకణ మహారాజ్ ప్రసంగం ఉంటుంది.

– శ్రీపాద హరిదాస్ బ్రహ్మచారి, శ్రీకృష్ణ చైతన్య ఆశ్రమం

ప్రతి ఒక్కరూ ఆహార భద్రత పాటించాలి



రెస్టారెంట్‌లో తనిఖీ నిర్వహిస్తున్న అనంతరావు, రుక్కయ్య తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: వినియోగదారులకు నిర్వాహకులు నాణ్యమైన ఆహారం అందించాలని జిల్లా వినియోగదారుల రక్షణ మండలి సభ్యుడు గొట్టిముక్కల అనంతరావు పేర్కొన్నారు. బుధవారం నగరంలోని పలు రెస్టారెంట్లలో జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి రుక్కయ్య, నగరపాలక సంస్థ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రుక్కయ్య మాట్లాడుతూ కిచెన్ పరిశుభ్రంగా ఉండాలని, ఆహారాన్ని నిల్వ ఉంచకూడదని, ఫుడ్ సేఫ్టీ నిబంధనలు కచ్చితంగా పాటించాలన్నారు. తనిఖీల సందర్భంగా సేకరించిన ఆహారం నమూనాలను ల్యాబ్‌కు పంపిస్తామన్నారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య లోపానికి జరిమానా విధించారు. నగర పాలక సంస్థ శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.రాజు, కార్యదర్శి షహనాజ్ తదితరులు పాల్గొన్నారు.

బాలికల హాస్టల్ సేవలను వినియోగించుకోవాలి

కడియం: మండల కేంద్రమైన కడియంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహం సేవలను సద్వినియోగం చేసుకోవాలని వసతి గృహం వెల్ఫేర్ ఆఫీసర్ ఏపీవీ లక్ష్మి కోరారు. 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు అన్ని కులాలకు చెందిన విద్యార్థినులు ఈ హాస్టల్‌లో చేరవచ్చన్నారు. డ్రాపవుట్ విద్యార్థులను కూడా తిరిగి స్కూల్లో చేర్పించి, హాస్టల్లో వసతి సదుపాయం కల్పిస్తామన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మేరకు మెనూతో భోజన సదుపాయం ఉంటుందన్నారు. పదో తరగతి విద్యార్థినులకు ఇంగ్లిష్, హిందీ, లెక్కలు, సైన్స్ సబ్జెక్టులకు ట్యూషన్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అలాగే యోగా, కరాటే కూడా నేర్పిస్తున్నామన్నారు. ఈ మేరకు పోస్టర్ల ద్వారా గ్రామాల్లో విస్తృత ప్రచారం చేస్తున్నామని ఏపీవీ లక్ష్మి తెలిపారు.

ఉద్యోగుల బకాయిలు చెల్లించకపోవడం అన్యాయం



కార్యక్రమంలో మాట్లాడుతున్న గిరిప్రసాద్ వర్మ

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ప్రభుత్వం ఉద్యోగుల రూ.25 వేల కోట్ల బకాయిలను చెల్లించకపోవడం అన్యాయమని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు పి.గిరిప్రసాద్‌వర్మ అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ‘రండి, టీ తాగుతూ మాట్లాడుకుందాం’ కార్యక్రమాన్ని బుధవారం సాయంత్రం రాజమహేంద్రవరంలోని ఆర్అండ్‌బీ డివిజన్ కార్యాలయంలో భగవతి అప్పారావు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన గిరి ప్రసాద్ వర్మ ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ ఈ బకాయిల చెల్లింపులకు సంబంధించి ఒక పరిష్కార మార్గాన్ని సూచించారన్నారు. దాన్ని ఉద్యోగులకు వివరించడానికి, వారి అభిప్రాయాలను తెలుసుకోవడానికి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వం తక్షణమే పీఆర్‌సీ కమిషన్‌ను నియమించి, ఇంటీరియమ్ రిలీఫ్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరం నగర ఉపాధ్యక్షుడు భగవతి అప్పారావు మాట్లాడుతూ నగరంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించి ఉద్యోగుల సమస్యలపై చర్చించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో నగర శాఖ నాయకులు ఎండీ రెహమాన్, బీఎస్‌వీ భద్ర, ఎం.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హాస్యనటుడు రేలంగికి ఘన నివాళి



రేలంగి విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి కందుల దుర్గేష్ తదితరులు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): తెలుగు సినిమా హాస్యానికి పద్మశ్రీ రేలంగి వెంకట్రామయ్య మకుటం లేని మహారాజు అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. హాస్యనట చక్రవర్తి, పద్మశ్రీ అవార్డు గ్రహీత రేలంగి వెంకట్రామయ్య జయంతిని బుధవారం పుష్కరఘాట్‌లో నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రేలంగి విగ్రహానికి కందుల దుర్గేష్ పూల మాల వేసి నివాళులర్పించారు. ఉభయ రాష్ట్రాల బీసీ సంఘ జేఏసీ కన్వీనర్ మార్గాని నాగేశ్వరరావు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ యామన నారాయణగౌడ్, నిర్వహణ కమిటీ నేతలు రెడ్డి రాజు, మార్గాని చంటిబాబు, రెడ్డి మణి, బుద్దిగ రాధా, రాయుడు శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నేత నరవ గోపాలకృష్ణ, రాజమండ్రి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కుడిపూడి సారథి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



కడియంలో సమావేశమైన ఉద్యోగులు

కడియం: ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఉద్యోగ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఏపీ ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యల సాధనకు ఆంధ్రప్రదేశ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ‘రండి.. టీ తాగుతూ మాట్లాడుకుందాం’ అనే కార్యక్రమాన్ని బుధవారం కడియం పంచాయతీ కార్యాలయంలో నిర్వహించారు. ఉద్యోగులకు రావాల్సిన రూ. 30 వేల కోట్ల బకాయిల చెల్లింపు, డీఏ, ఐఆర్, పీఆర్‌సీ కమిషన్ ఏర్పాటు వంటి సమస్యల పరిష్కారం కోరుతూ ఈ సమావేశాలు నిర్వహిస్తున్నారు. జిల్లా కార్యదర్శి సీహెచ్ఎస్ విల్సన్ పాల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ ప్రసంగాల వీడియోలను ప్రదర్శించారు. కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ కె. శ్రీనివాసరెడ్డి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

అక్టోబర్ 25, 26 తేదీల్లో గోదావరి బాలోత్సవం



గోదావరి బాలోత్సవం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

ప్రకాశం నగర్: గోదావరి బాలోత్సవం మూడో పిల్లల పండగను అక్టోబర్ 25, 26వ తేదీల్లో ఘనంగా నిర్వహించనున్నట్టు బాలోత్సవం ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.తులసి తెలిపారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పిల్లల పండగ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ఏడాది ఫిబ్రవరిలో జరగాల్సిన ఈ కార్యక్రమం ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో వాయిదా పడిందన్నారు. గతంలో అన్ని స్కూళ్లకు రిజిస్ట్రేషన్ ఫారాలు ఇచ్చామని, వాటిని ఇప్పుడు ఉపయోగించుకోవచ్చన్నారు. ఈ ఏడాది 24 అకాడమిక్, 13 కల్చరల్ అంశాల్లో జూనియర్, సబ్ జూనియర్స్, సీనియర్స్ విభాగంలో దాదాపు 70 పోటీలు జరుగుతాయని వివరించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పాఠశాలలకు దరఖాస్తులను అందజేశామన్నారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బాలోత్సవం అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.కృష్ణకుమార్, ఉపాధ్యక్షుడు నవీన కుమారి తదితరులు పాల్గొన్నారు .

క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు

కంబాలచెరువు: విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని స్థానిక ప్రభుత్వ అటానమస్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే అన్నారు. ఆ కాలేజీలో బుధవారం నషాముక్త భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈగిల్ కో ఆర్డినేటర్ డాక్టర్ జె.సురేష్, రసాయన శాస్త్ర విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ఈ ప్రోగ్రామ్ జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు లోను కాకుండా, క్రమశిక్షణతో మంచి అలవాట్లను అలవర్చుకోవాలన్నారు. ఈగిల్ కమిటీ డిస్ట్రిక్ట్ సీఐ పీవీ సూర్య మోహన్ మాట్లాడుతూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండడం ద్వారా సమాజ నిర్మాణంలో గొప్ప పాత్ర పోషించవచ్చన్నారు. కార్యక్రమంలో ఈగిల్ కమిటీ ఆర్ఐ నారాయణ, సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ నరేష్, రసాయన శాస్త్ర విభాగాధిపతి టి.శ్రీనివాసరావు, ఈగిల్ కమిటీ సభ్యులు జె.యాకూబ్, రెడ్ క్రాస్ కో ఆర్డినేటర్ జి.రవితేజ తదితరులు పాల్గొన్నారు.

నగరాన్ని ముంచెత్తిన వర్షం

- పల్లపు ప్రాంతాలు జలమయం
- రాకపోకలకు అవస్థలు



భారీ వర్షానికి జలమయమైన హైటెక్ బస్టాండ్ రోడ్డు

రాజమహేంద్రవరం సిటీ: వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులతో బుధవారం కురిసిన భారీ వర్షానికి నగరం తడిసి ముద్దయ్యింది. పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి పాదచారులు, ద్విచక్ర వాహన దారులు, చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. శ్యామలా సెంటర్, ఆర్యాపురం సీతంపేట, ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డు, స్టేడియం రోడ్డు, కంబాలచెరువు, రైల్వే స్టేషన్ రోడ్డు, లాలాచెరువు జంక్షన్, హైటెక్ బస్టాండ్ జంక్షన్, రామచంద్రరావుపేట, కృష్ణానగర్, పేపర్ మిల్ రోడ్, ఆదెమ్మదిబ్బ తదితర ప్రాంతాల్లో రోడ్లపైకి నీరు చేరింది.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

రానున్న రోజుల్లో నగరంలో అధిక వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, ప్రజల భద్రతార్థం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్, జిల్లా కలెక్టర్ ప్రశాంతి విజ్ఞప్తి చేశారు. వర్షాల కారణంగా ఎలాంటి అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు వెంటనే కంట్రోల్ రూమ్ నెంబర్ 9494060060కు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. నగరపాలక సంస్థలో 24 గంటలూ కంట్రోల్ రూమ్ పనిచేస్తుందన్నారు.

సమర్థంగా ఫార్మెటివ్-1 పరీక్షలు

కంబాలచెరువు: ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఫార్మెటివ్ - 1 పరీక్షలను సమర్థంగా నిర్వహించాలని అర్బన్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్ కుమార్ ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. స్థానిక బైపాస్ రోడ్డులోని దానవాయిపేట మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులను పదో తరగతి పబ్లిక్ పరీక్షల మాదిరిగా కూర్చోబెట్టాలన్నారు. పరీక్షలు అయిన తర్వాత వెంటనే బుక్ లెట్‌లలో విద్యార్థుల జవాబులను దిద్ది, మార్కులను రిజిస్టర్‌లో నమోదు చేసి, ఆన్‌లైన్ చేయాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎస్.రవికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

17న రేమెళ్ల వేదశాస్త్ర విద్వన్మహాసభ

సీటీఆర్ఐ: బ్రహ్మశ్రీ రేమెళ్ల సూర్య ప్రకాశ శాస్త్రి వేద శాస్త్ర చారిటబుల్ ట్రస్టు 34వ వార్షికోత్సవ వేద శాస్త్ర విద్వన్మహాసభలు ఈనెల 17వ తేదీ సాయంత్రం 5 గంటలకు త్యాగరాజ నారాయణ దాస సేవాసమితిలో జరుగుతాయి. ఈ మేరకు పరిషత్తు అధ్యక్షుడు హోతా సీతారామశాస్త్రి, కార్యదర్శి పుల్లెల సత్యనారాయణ బుధవారం ప్రకటన విడుదల చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం సౌజన్యంతో జరిగే ఈ కార్యక్రమంలో ‘స్వాధ్యాయరత్న’ గుళ్లపల్లి సీతారామచంద్ర ఘనపాఠి ఆధునిక కాలంలో వేదసమ్మతమైన లౌకిక జీవనము అనే అంశంపై ప్రసంగిస్తారు. సమన్వయ సరస్వతి సామవేదం షణ్ముఖ శర్మ వేదం గురించి ప్రసంగిస్తారు. తిరుమల తిరుపతి దేవస్థానం ప్రాజెక్టు అధికారి ఆకెళ్ల విభీషణశర్మ గౌరవ అతిథిగా పాల్గొంటారు. వేద సమ్రాట్ కడియాల సీతారామచంద్ర ఘనపాఠి ఆధ్వర్యంలో వేదస్వస్తి జరుగుతుంది. ఈ కార్యక్రయమంలో వేదశాస్త్రాభిమానులు పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

హోమ్ కంపోస్టింగ్‌ను ప్రోత్సహించాలి

రాజమహేంద్రవరం సిటీ: ప్రతి ఒక్కరూ తడి, పొడి చెత్తను వేరు చేసి కార్మికులను ఇవ్వాలని, అలాగే హోమ్ కంపోస్టింగ్‌ను ప్రోత్సహించాలని ఆర్టీసీ కాలనీ ఇన్‌చార్జి ఖాన్ పిలుపు నిచ్చారు. పదో డివిజన్‌లోని ఆర్టీసీ కాలనీలో బుధవారం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడి చెత్తను ఎరువుగా చేసుకుని ఇంటి మిద్దె తోటల్లో వాడుకోవాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కంబాలచెరువు: మోటారు సైకిల్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో ఒక వ్యక్తి మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. షేక్ మహ్మద్ అబ్దుల్ (30) మెయిన్‌రోడ్డులోని ఖాదీమ్ చెప్పుల షోరూమ్‌లో సేల్స్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. అతడికి మంగళవారం సెలవు కావడంతో బయటకు వచ్చి, రాత్రి తిరిగి ఇంటికి వెళుతున్నాడు. కంబాలచెరువు జంక్షన్‌కు వచ్చే సరికీ అతడి మోటార్ సైకిల్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. గాయాలపాలైన అబ్దుల్‌ను వెంటనే నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నగరంలో హర్ ఘర్ తిరంగా



హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న సీఆర్‌పీఎఫ్ జవాన్లు



ర్యాలీలో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ ఇంజినీర్ బాలకృష్ణ

కంబాలచెరువు: సీఆర్‌పీఎఫ్ 42 బెటాలియన్ ఆధ్వర్యంలో బుధవారం నగరంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఆర్‌పీఎఫ్ సెకండెంట్ కమాండ్ దీప తదితరులు పుష్కర్‌ఘాట్‌లో నగర ప్రజలనుద్దేశించి మాట్లాడారు. భారతదేశం గొప్పతనం, జాతీయ జెండా విశిష్టతను వివరించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదేశాల మేరకు దేశ పౌరులందరూ తమ ఇంటిపై జాతీయ జెండాను ఎగరవేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమాండెంట్లు దీపక్ కుమార్, దినేష్ కుమార్ శర్మ, డాక్టర్ శ్రీనితిన్, ఇన్‌స్పెక్టర్ శశికుమార్, సహచర జవాన్లు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం సిటీ: స్వాతంత్ర దినోత్సవంపై అవగాహన కల్పించేందుకు తిరంగా యాత్ర నిర్వహించినట్లు ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర ఆధ్వర్యంలో బుధవారం స్వాతంత్య్ర సమర యోధుల పార్కులో విగ్రహాలను శుభ్ర పరిచి, వారికి నివాళులు అర్పించారు. అనంతరం తిరంగా యాత్ర, బైక్ ర్యాలీ నిర్వహించారు.

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. స్వాతంత్య్ర సమర యోధుల త్యాగాలను స్మరించుకుంటూ, ప్రతి ఇంటా జాతీయ పతాకం ఎగిరేలా ఈ కార్యక్రమాన్ని చేపట్టామని పంచాయతీ రాజ్ సూపరింటెండెంట్ ఇంజినీర్ కె.బాలకృష్ణ తెలిపారు. పంచాయతీ రాజ్ కార్యాలయం నుంచి ఆర్ట్స్ కళాశాల, వై.జంక్షన్, సెంట్రల్ జైలు మీదుగా ర్యాలీ సాగింది. కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ వి.శ్రీరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

